క్లుప్తంగా

రేపటి నుంచి పశువులకు టీకాలు

రాజవొమ్మంగి: పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధి నివారణకు సంభందించి ఈ నెల 2వ తేదీ నుంచి టీకాల పంపిణీ చేస్తున్నట్టు పశు వైద్యాధికారి తరుణ్ తెలిపారు. ఈ వ్యాధి సోకిన పశువుల నోరు, కాళ్లకు పుండ్లు ఏర్పతాయని, పశువులు మేత మేయవని డాక్టర్ అన్నారు. పశువుల నోటి నుంచి నిరంతరంగా చొంగ రావడం ఈ వ్యాధి లక్షణాల్లో ఒకటి అన్నారు. పశువులను మరణ దశ నుంచి కాపాడేందుకు, ఈ వ్యాధి నివారణకు మండలానికి 11వేల డోసుల వ్యాక్సిన్ వచ్చిందని, ప్రతి రైతు క్షేత్రానికి తమ సిబ్బంది వెళ్లి టీకాలు వేస్తారన్నారు. రైతులు సహకరించాలని కోరారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం



బాధితులకు నిత్యావసర సరకులు, వంట సామగ్రి అందజేస్తున్న ఉద్యోగులు

రాజవొమ్మంగి: మండలంలోని లాగరాయి గ్రామంలో మూడు రోజుల క్రితం అగ్ని ప్రమాదం సంభవించి సర్వం కోల్పోయిన రెండు కుటుంబాలకు స్థానికులు సాయం అందించారు. బాధిత పొట్టబోయిన మారయ్య, కుమారుడు నాగరాజులకు లాగరాయి మన్యవీధి ఉద్యోగులు వంట సామగ్రి, కూరగాయలు, బియ్యం, రగ్గులు, రూ. 2వేల నగదు అందజేశారు. ఉపాధ్యాయులు నాగరాజు, సన్యాసిరావు, పి.నాగరాజు, రమణ, నానాజీ, శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే గ్రామంలోని కోయవీధి యూత్ సభ్యులు 200 కిలోల బియ్యం, దుస్తులు, గిన్నెలు పంపిణీ చేశారు. మంగరాజు, రాంబాబు, సత్యనారాయణ, శ్రీనివాసు దొర, లీలావతి, మణమ్మ, సత్తిబాబు, ప్రసాద్ పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య అక్షింతలు



అక్షింతలను ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు

రాజవొమ్మంగి: రంపచోడవరం డివిజన్‌లోని 11 మండలాలకు అయోధ్య నుంచి అక్షింతలు వచ్చాయని సమరతసేవా ఫౌండేషన్ డివిజన్ ధర్మ ప్రచారక్ విశ్వనాథరెడ్డి తెలిపారు. ప్రతి పంచాయతీకి 5 కిలోల చొప్పున అందజేయనున్నట్టు పేర్కొన్నారు. జనవరి 22వ తేదీన అయోధ్యలో జరగనున్న బాల రాముని ప్రాణ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా ప్రతి దేవాలయంలో భజనలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

రగ్గుల పంపిణీ



యాచకులకు రగ్గులు పంపిణీ చేస్తున్న దాత త్రినాథ్

సాక్షి,పాడేరు: పట్టణంలోని సాధువులు, యాచకులకు చలి నుంచి రక్షణ కల్పించే రగ్గులను వస్త్ర వ్యాపారి బొజ్జా త్రినాథ్ ఆదివారం పంపిణీ చేశారు.వారు సంతోషం వ్యక్తం చేశారు. దాత త్రినాథ్ మాట్లాడుతూ పేదలను ఆదుకునేందుకు అందరూ ముందుకు రావాలని కోరారు.

మత్స్యావతారంలో పాండురంగడు



పాయకరావుపేట : పట్టణంలో గల శ్రీరాధారుక్మిణీ సహిత పాండురంగ స్వామి ఆదివారం మత్స్యావతారంలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా పాండురంగ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా తుని, పాయకరావుపేట పట్టణాలకు చెందిన పలువురు భక్తులు పాండురంగ స్వామిని దర్శించుకుని, పూజలు చేశారు. ఆలయ అర్చకులు కృష్ణస్వామి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందిస్తున్నారు. ఆలయ ఈవో ఆధ్వర్యంలో ఘనంగా పూజలు జరుగుతున్నాయి.

అన్నదాతకు అండగా ఆర్‌బీకేలు

- రాయితీపై ఎరువులు, విత్తనాలు అందజేత
- సాగుకు సూచనలు, సలహాలు
- ఆనందంలో గిరిజన రైతులు





పంటకోత ప్రయోగం చేస్తున్న సిబ్బంది



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు, నేతలు

దుంబ్రిగుడ : నాడు టీడీపీ ప్రభుత్వ పాలనలో విత్తనాలు, ఎరువుల కోసం రోజుల తరబడి వ్యవసాయ శాఖ కార్యాలయాల చుట్టూ తిరిగే వారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో బయట మార్కెట్‌లో నకిలీ విత్తనాలు కొనుగోలు చేసేవారు..ఆరుగాలం పండించిన పంట నష్టపోవడంతో రైతులు నానా అవస్థలు పడేవారు.. సాగు లేక..అప్పులు పెరిగి ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యేవారు.. వ్యవసాయాన్ని చంద్రబాబు ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడంతో అన్నదాతకు నానా కష్టాలు ఎదరయ్యాయి... అదంతా గతం.. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక వ్యవసాయ రంగానికి పెద్దపీట వేశారు. వ్యవసాయాన్ని పండగగా మార్చేశారు. విత్తు నాటినప్పటి నుంచి పంట కొనుగోలు వరకు రైతన్నకు అండగా నిలుస్తున్నారు. రైతు భరోసా ద్వారా సాగు పెట్టుబడి సాయం అందించడంతో పాటు ఎరువులు, విత్తనాలను రైతులకు అందజేస్తున్నారు. రైతులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు రైతు భరోసా కేంద్రాలను అందుబాటులో తీసుకొచ్చారు. సాగు సూచనలు, సలహాలతో పాటు వ్యవసాయ యంత్రాలు అందజేత తదితర సేవలన్నీ రైతుల చెంతకే అందుతున్నాయి. అన్నదాతను రారాజు మార్చేశారు..

సేవలిలీ

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మండలంలో 18 సచివాలయాల పరిధిలో 18 ఆర్‌బీకేలు ఏర్పాటు చేసింది.

ఒక్కో ఆర్‌బీకెకు రూ.20 లక్షలు చొప్పున మండలంలోని 18 ఆర్‌బీకెలకు రూ. 3.60కోట్లు వెచ్చించి భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రాయితీపై ఎరువులు, విత్తనాలతో పాటు వ్యవసాయ యంత్రాలు ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు తదితర యంత్రాలను అందజేస్తోంది. రైతు భరోసా కేంద్రాల ద్వారా రూ. 1580 విలువ చేసే 10కిలోల రాజ్‌మా ప్యాకెట్ 90 శాతం రాయితీపై కేవలం రూ. 158లకే ప్రభుత్వం అందజేస్తోంది. వీటి ద్వార రైతులకు సకాలంలో సేవలందుతుని గిరిరైతులు



పంట దిగుబడిని పరిశీలిస్తున్న సిబ్బంది

చెబుతున్నారు. ఆర్‌బీకేల ద్వారా 375 మందికి ధాన్యం విత్తనాలు, 2352 మందికి రాజ్‌మా విత్తనాలు, 235 మందికి వేరుశనగ విత్తనాలను పంపిణీ చేసింది. దీంతోపాటు క్లస్టర్ హైరింగ్ పద్ధతి ద్వారా రైతులకు పవర్ వీటర్లు, ట్రాక్టర్లు, పవర్ టిల్లర్‌లను అందజేస్తోంది.



సాగర గ్రామంలో రైతు భరోసా కేంద్రం

జగనన్నకు రుణపడి ఉంటాం



గతంలో విత్తనాల కోసం నానా అవస్థలు పడ్డాను. సంతల్లో నకిలీ విత్తనాలు కొనుగోలు చేయడంతో పంట చేతికందలేదు. ప్రస్తుతం జగనన్న ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఆర్‌బీకేల ద్వారా సకాలంలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుతున్నాయి. సాగు పెట్టుబడి సాయం అందుతోంది. ఆర్‌బీకేలతో ఎంతో మేలు జరుగుతోంది. జగనన్న ప్రభుత్వానికి గిరి రైతులందరూ రుణపడి ఉంటాం.

– ఎరుక నాయుడు, రైతు, దుంబ్రిగుడ

సకాలంలో విత్తనాలు, ఎరువులు

రైతులందరికీ ఆర్‌బీకేల ద్వారా సకాలంలో విత్తనాలు, ఎరువులను అందజేస్తున్నాం. క్లస్టర్ హైయిరింగ్ ద్వారా వ్యవసాయ యంత్రాలను అందజేస్తున్నాం. విత్తన శుద్ధి, భూసారంతో పాటు పంటల ఎంపిక గురించి రైతులకు తెలియజేస్తున్నారు. పంట సాగుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నాం. ఆర్‌బీకే సిబ్బంది క్షేత్రాలకు వెళ్లి పంటలను పరిశీలిస్తున్నారు. ఈ–క్రాప్ నమోదు

– నీలవేణి,
మండల వ్యవసాయాధికారి, దుంబ్రిగుడ

ముగిసిన వాలీబాల్ పోటీలు



క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం

రాజవొమ్మంగి: ఇటీవల పార్వతీపురం మన్యం జిల్లా పి.కోనవలస పాఠశాలలో జరిగిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలో స్థానిక గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల క్రీడాకారులు ద్వితీయ స్థానం దక్కించుకొన్నారు. వీరిని ఆదివారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు అభినందనలు తెలిపారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



మోదకొండమ్మతల్లిని దర్శించుకుంటున్న భక్తులు

సాక్షి,పాడేరు: మన్య ప్రజల ఆరాధ్య దైవం పాడేరులోని మోదకొండమ్మ తల్లి ఆలయానికి ఆదివారం మైదాన ప్రాంతానికి చెందిన భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత ప్రసాద వితరణ జరిగింది.

తారుమారు సంత ఏర్పాట్లు పరిశీలన



తారుమారు సంత నిర్వహణకు ఏర్పాట్లను పరిశీస్తున్న సర్పంచ్ రాంబాబు

జి.మాడుగుల: మండల కేంద్రంలో వెంకటరాజ్ ఘాట్ వద్ద మంగళవారం నిర్వహించే తారుమారు సంత(పండుగ సంత)కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు నిర్వాహకులు సర్పంచ్ కిముడు రాంబాబు, మత్స్యరాస నాగరాజు తెలిపారు. ఏటా సంక్రాంతి పండగను దృష్టిలో పెట్టుకొని స్థానిక పెద్దలు తారుమారు సంతను నిర్వహించటం అనవాయితీగా వస్తుంది. అలాగే జనవరి 9న ఈ ప్రదేశంలోనే వారపుసంత జరుగుతుందని వారు చెప్పారు. తారుమారు సంతలో వ్యాపారాలు సవ్యంగా జరగటానికి, రైతుల ధినుసులు విక్రయించుకోవటానికి ఎటువంటి ఇబ్బందులు, సమస్యలు లేకుండా తగిన ఏర్పాట్లు చేశామన్నారు. వ్యాపారులు, రైతులు, ప్రజలు తారుమారు సంతను విజయవంతం చేయాలని వారు తెలిపారు. పాడేరు ఏఎంసీ టేజరర్ అడపా బాబూరావు, సమర సతా సేవా ఫౌండేషన్ కన్వీనర్ మత్స్యరాజు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా జన్‌మన్ సర్వే



బర్సింగిమెట్టలో సర్వే నిర్వహిస్తున్న హౌసింగ్ ఏఈ ఈశ్వరరావు

జి.మాడుగుల: పీవీటీజీ కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపర్చటానికి కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి జన్‌మన్ పథకం ద్వారా కొత్త ఇళ్ల నిర్మాణానికి ముమ్మరంగా సర్వే నిర్వహిస్తున్నట్టు హౌసింగ్ ఏఈ డి.ఈశ్వరరావు తెలిపారు. ఈ మేరకు మండలంలో గడుతూరు పంచాయతీ బర్సింగిమెట్ట గ్రామంలో ఆదివారం సర్వే చేశారు. ఆదివాసీ గ్రామాల్లో ప్రభుత్వం అన్ని మౌలిక సదుపాయలు కల్పించడంతో పాటు ఆదివాసీ కుటుంబాలకు పక్కా ఇళ్ల నిర్మాణానికి రూ.2.39లక్షలు ఆర్థిక సహాయం అందిస్తోందని ఆయన తెలిపారు. ప్రతీ పీవీటీజీ నివాసాన్ని గుర్తిస్తున్నామని ఆదివాసీ ప్రజలు సర్వే అధికార్లు, సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు. వర్క్ ఇన్స్‌పెక్టర్ పి.సత్యనారాయణ, డీవో పి.కళ్యాణం పాల్గొన్నారు.

ఆదివాసీల హక్కులు పరిరక్షించాలి



వై.రామవరంలో ఆదివాసీ జెండాను ఎగురవేస్తున్న నాయకులు



చింతూరులో ఆదివాసీ జెండాను ఎగురవేస్తున్న నాయకులు




వై.రామవరంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆదివాసీ సంక్షేమ పరిషత్ నేతలు

చింతూరు: ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆవిర్భావ దినోత్సవాన్ని చింతూరు, ఎటపాక, వై.రామవరం మండలాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చింతూరు మండలంలోని ఏజీ కొడేరులో జరిగిన కార్యక్రమంలో పరిషత్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి సోడె మురళీ మాట్లాడుతూ ఆదివాసీ సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఆదివాసీల హక్కులను పరిరక్షించుకోవాలన్నారు. మండలంలో ఫిబ్రవరి 9 నుంచి 11వ తేదీ వరకు జాతీయ స్థాయి ఆదివాసీ సాంస్కృతిక సమ్మేళన కార్యక్రమం నిర్వహించునున్నట్టు తెలిపారు.

ఎటపాక: ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురుషోత్తపట్టణంలోని దమ్మక్కగూడెంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏయస్పీ, ఆదివాసీ టీచర్స్ ఆసోసియేషన్ ఆధ్వర్యంలో కొమరం భీం చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదివాసీ జెండాను ఆవిష్కరించారు. ఏటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను మాట్లాడుతూ ఆదివాసీ పరిషత్ తరపున సమస్యలపై అనేక పోరాటాలు చేశామన్నారు. రామకృష్ణ, అనిల్ ,కాంతారావు, నాగేశ్వరరావు, నాగమణి పాల్గొన్నారు.

వై.రామవరం: ఆదివాసీ హక్కుల పరిరక్షణకు ఐక్యంగా పోరాడదామని ఆదివాసీ చైతన్య వేదిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వెదుళ్ల లచ్చిరెడ్డి పిలుపునిచ్చారు. సంఘం మండల అధ్యక్షుడు సూరిబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రతినిధులు లచ్చిరెడ్డి, వెంకటేశ్వర్లుతో పాటు పలువురు పాల్గొన్నారు. వారు మాట్లాడుతు ఆదివాసీల హక్కులు, గిరిజన చట్టాలు పకడ్బందీగా అమలుకు కృషి చేద్దామన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన గిరిజన సంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బాలకృష్ణ, నాగరాజు, త్రిమూర్తులు, లింగారెడ్డి, లక్ష్మణ రావు, సర్పంచ్ పల్లాల బాలురెడ్డి పాల్గొన్నారు.

కోటి ఆశలతో.. కొత్త సంవత్సరానికి..



ఇంటి ముందు అందంగా అలంకరించిన ముగ్గు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలో ప్రతి వీధిలో కొత్త సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. ఇంటింటా నూతన సంవత్సర ఆగమన శోభ సంతరించుకుంది. ఇళ్ల ముందు అందమైన రంగవల్లులను తీర్చిదిద్దారు. నూతన సంవత్సరం సందర్భంగా కేక్‌షాపులు, బిర్యానీ పాయింట్లు, పండ్ల దుకాణాలు కిటకిటలాడాయి. పూలబొకేల అమ్మకాలు జోరుగా సాగాయి. చర్చిల్లో రాత్రి ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. తెల్లవారుజాము నుంచి ఆలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేశారు. వీధుల్లో యువత సందడి చేశారు. ప్రతి ఇంటా సంతోషం సంతరించుకుంది.

కొండరెడ్డిల అభ్యున్నతికి కృషి



కొత్త కారుమాను కొండలో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు



కొల్లూరు గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో మాట్లాడుతున్న అధికారులు

కూనవరం: అట్టడుగు వర్గాలకు చెందిన కొండరెడ్డిలకు గ్రామాల్లో గృహ నిర్మాణాలు, మౌలిక వసతుల కల్పనపై అధికారులు, సచివాలయం సిబ్బంది ఆదివారం గ్రామసభ నిర్వహించారు. కొండరెడ్లు నివసిస్తున్న ఆవాసాల్లో ఇంటింటా సర్వే చేపట్టారు. అనంతరం కొత్త కారుమాన్ కొండలో గ్రామసభ నిర్వహించి వారి అవసరాలను తెలుసుకున్నారు. చింతూరు ఐటీడీఏ పీఓ కావూరి చైతన్య ఆదేశాల మేరకు సర్వేలు నిర్వహించి, గ్రామసభలు ఏర్పాటు చేస్తున్నామని తహసీల్దార్ కె అనసూయ తెలిపారు. ప్రధాన మంత్రి జన్‌మన్ పథకం ద్వారా చేపట్టిన సర్వేలో ఆధార్ కార్డు లేని వారు 22 మంది, బ్యాంకు ఖాతా లేనివారు 32 మంది, జాబ్ కార్డు లేని కుటుంబాలు 13, బర్త్ సర్టిఫికెట్ లేనివారు 14 మంది, కులం, ఆదాయం ధ్రువపత్రాలు లేని వారు 62 మంది, ఆరోగ్యశ్రీ కార్డు లేని వారు ఒకరుగా గుర్తించామన్నారు. ఆయా ధృవపత్రాలను ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు. కూటూరు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, వీఆర్వో బ్రహ్మయ్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వీఆర్ పురం: కొండరెడ్డి గిరిజనుల కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టి వారి అభివృద్ధికి ప్రత్యేకంగా దృష్టి సారిస్తుందని తహసీల్దార్ ఎన్.శ్రీధర్,ఎంపీడీఓ ఆర్.ఫణీంద్రరెడ్డి అన్నారు. మండలంలోని కొండరెడ్డి గిరిజనుల గ్రామాలైన కొల్లూరు, గొందురు, కొండేపూడి, తుమ్మిలేరు, పోచవరం గ్రామాలల్లోఆదివారం పీఎం జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా పర్యటించి గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో గ్రామస్తులకు కేంద్ర ప్రభుత్వ పథకాలు గురించి పూర్తి అవగాహన కల్పించారు.

ఈ గ్రామసభల ద్వారా జనన, మరణ ధ్రువపత్రాలు- 7,ఉజ్వల గ్యాస్ పథకం- 5, కొత్త ఉపాధి కార్డులు 8,కొత్త బ్యాంకు ఖాతా 10 మొత్తం - 38 సర్టిఫికెట్స్ ఇవ్వడం తో పాటు మరియు ఇతర సమస్యలు. కూడా పరిష్కరించినట్టు తెలిపారు. సర్పంచ్ అందెల సీతారామిరెడ్డి, అడిషనల్ డీఎం అండ్‌హెచ్‌వో పి.పుల్లయ్య, ప్రోగ్రాం నోడల్ ఆఫీసర్ ఏపీఎం కిరణ్ , ఈఓపీఆర్‌డీ పి.వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోడి పందాలు ఆడుతున్న 15 మంది అరెస్టు

చింతపల్లి రూరల్: కోడి పందాలు ఆడుతున్న15 మందిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ అరుణ్ కిరణ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ తాజంగి, లంబసింగి ప్రాంతాల్లో కోడిపందాలు నిర్వహిస్తున్నట్టు తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో చెరువులవెనం సమీపంలో కోడిపందాలు నిర్వహిస్తున్న శిబిరంపై దాడి చేశామన్నారు. 15 మందిని అరెస్టు చేశామని, 11 కోళ్లు, రూ.37,750లు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిని అరెస్టు చేసి కేసు నమోదు చేశామని ఎస్‌ఐ అయిణ్ కిరణ్ తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ సత్తిబాబు, పీఏసీఎస్ చైర్మన్ విజయ్‌రెడ్డి, ఏవో శ్రీనివాసరావు, తహసీల్దార్ సుబ్బారావు

చింతూరు: రైతులు దళారుల బారిన పడకుండా తమ పంటలను మంచి గిట్టుబాటు ధరకు విక్రయించాలని పీఏసీఎస్ చైర్మన్ శ్యామల విజయ్ రెడ్డి సూచించారు. మండలంలోని ఏడుగురాళ్లపల్లిలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ సవలం సత్తిబాబుతో కలసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మేలు చేకూర్చేందుకు ప్రభుత్వం నేరుగా ధాన్యం కొనుగోలు చేస్తూ గిట్టుబాటు ధర కల్పిస్తోందన్నారు. రైతులు తాము పండించిన ధాన్యాన్ని ఇక్కడ అమ్మడం ద్వారా మంచిధర పొందవచ్చన్నారు. ఏవో శ్రీనివాసరావు మాట్లాడుతూ చింతూరు మండలంలో నాలుగు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. రైతులు తమ పంటలను మిషన్ ద్వారా కోసి గుట్టలుగా పోసి ఉంచుతున్నారని, కోసిన ధాన్యాన్ని విడదీసి పలచగా ఆరబెట్టాలని తద్వారా రంగు మారకుండా నిరోధించే అవకాశముందని సూచించారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా ధాన్యం అమ్ముకునేలా ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందన్నారు. కొంతమంది దళారులు మిల్లర్లతో కుమ్మక్కై ధాన్యాన్ని ఆర్‌బీకేల ద్వారా అమ్మిస్తామని రైతులను మభ్యపెడుతున్నారని అలాంటి వారి మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. ఆర్‌బీకేలకు ధాన్యం సరఫరా చేసేటప్పుడు వీఏవోల వద్ద రిజిస్టరు చేయిస్తేనే సివిల్ సప్లయి శాఖ ధాన్యం కొనుగోలుకు అనుమతి ఇస్తుందని, అలాగైతేనే రైతుల ఖాతాల్లో సొమ్ములు పడతాయని ఏవో తెలిపారు. ఆర్‌బీకేలకు తీసుకొచ్చే ధాన్యానికి సంబంధించి వీఏవోల సంతకంతో కూడిన వోచర్‌ను రైతులు తప్పకుండా తీసుకోవాలని ఆయన సూచించారు. తహసీల్దార్ కారం సుబ్బారావు, వ్యవసాయశాఖ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌ఎస్‌సీ జీడీ, సీఆర్‌పీఎఫ్ పరీక్షలకు ఉచిత శిక్షణ

తుమ్మపాల: స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఆధ్వర్యంలో జీడీ, సీఆర్‌పీఎఫ్ తదితర విభాగాల్లో కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి అవసరమైన శిక్షణను రామ్‌కీ ఫౌండేషన్, పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్‌లు ఉచితంగా అందిస్తున్నట్టు హిమశేఖర్ డిగ్రీ కళాశాల ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. ప్రస్తుతం హైదరాబాదులో 250 మంది, గుంటూరులో 250 మంది శిక్షణ పొందుతున్నట్టు పేర్కొంది. సాయుధ బలగాల నియామకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం 26 వేలకుపైగా కానిస్టేబుళ్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్టు తెలిపింది. పదో తరగతి ఉత్తీర్ణులైన 18 నుంచి 23 ఏళ్ల లోపు ఓసీ అభ్యర్థులు, 26 ఏళ్లలోపు ఓబీసీ, 28 ఏళ్ల లోపు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు శిక్షణకు అర్హులుగా తెలిపింది.